# రెట్టింపు లాభాలంటూ కేజీ బంగారం తస్కరణ

## జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 6: బంగారం వ్యాపారంలో పెట్టుబడి పెడితే వారంలో రెట్టింపు లాభం వస్తుందంటూ నమ్మించి.. కేజీ బంగారంతో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్‌లో నివాసముంటున్న సి.షీలా రాణికి ఆమె కుమార్తె ద్వారా కార్తీక్‌రెడ్డి అనే యువకుడు పరిచయమయ్యాడు. కొంత కాలంగా తరచూ ఫోన్లు చేస్తున్న కార్తీక్‌రెడ్డి.. తనకు ప్రముఖ నిర్మాణ సంస్థ డీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా గ్రూపుతో బంధుత్వాలు ఉన్నాయని నమ్మబలికాడు. సంస్థకు చెందిన వ్యాపార కలాపాలతో పాటు కొన్ని సంస్థల లావాదేవీలు తానే చూస్తుంటానని, ఆయా సంస్థల్లో బంగారం పెట్టుబడిగా పెడితే వారం రోజుల్లో రెట్టింపు లాభం వస్తుందంటూ మాయమాటలు చెప్పాడు. దీంతో కార్తీక్‌రెడ్డి మాటలు నమ్మిన షీలారాణి.. తన ఆభరణాలు తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో ఒక కేజీ బంగారు నాణేలను కొనుగోలు చేసింది. వాటిని పంజాగుట్టకు వచ్చి తనకు ఇవ్వాలంటూ అతడు చెప్పగా.. ఆగస్టు 13న అక్కడికి వచ్చిన షీలారాణిని.. జూబ్లీ హిల్స్ రోడ్ నం. 10లోని అల్ కజార్ మాల్ వద్దకు పిలిపించాడు. ఆమె వద్ద నుంచి బంగారు నాణేలను తీసుకున్న కార్తీక్‌రెడ్డి ముఖం చాటేశాడు. రోజులు గడుస్తున్నా.. లాభాల మాట అటుంచి.. తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కార్తీక్‌రెడ్డిపై బీఎన్ఎస్ 316(2), 318(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# టీడీసీఏ గుర్తింపునకు సహకరించండి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వెంకటేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ డిస్ట్రిక్స్ అసోసియేషన్ (టీడీసీఏ)కు బీసీసీఐ గుర్తింపు కోసం సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కేవలం హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైందని, మిగతా జిల్లాల ప్లేయర్లకు ప్రాతినిధ్యం లేకుండా పోయిందని ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ గ్రామీణ యువతకు గత కొన్నేండ్ల నుంచి తీరని అన్యాయం జరుగుతున్నదని, ఈ విషయంలో కలుగజేసుకొని టీడీసీఏకు గుర్తింపునిచ్చేందుకు సహాయపడాలని కోరారు. తెలంగాణ జిల్లాల్లో ప్రతిభ కలిగిన క్రికెటర్లకు కొదువలేదని, వెన్నుతట్టి ప్రోత్సహిస్తే జాతీయ జట్టు, ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. హెచ్‌సీఏలో పూర్తిగా అవకతవకలు జరుగుతున్నాయని, ప్లేయర్ల ఎంపిక విషయంలో ప్రతిభకు కాకుండా పరపతికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# గ్రేటర్‌లో పలు చోట్ల వర్షం

## అడ్డగుట్టలో అత్యధికంగా 4.45సెం.మీ. వర్షపాతం నమోదు

### రాగల మరో రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో ఆదివారం గ్రేటర్‌లోని పలు చోట్ల వర్షం కురిసింది. రాత్రి 10గంటల వరకు నగరంలోని అడ్డగుట్టలో అత్యధికంగా 4.45సెం.మీ, న్యూ మెట్టుగూడలో 2.85సెం.మీ, సీతాఫల్‌మండిలో 2.43సెం.మీ, కూకట్‌పల్లిలో 1.60సెం.మీ, మల్లాపూర్‌లో 1.35సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తన ప్రభావం కొనసాగుతుండటంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లో మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.3.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.5డిగ్రీలు, గాలిలో తేమ 77 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**కేరళ మహం మాంత్రికుడు**

★ కేరళ మహం మంత్రికుడు స్త్రీ పురుష వశీకరణ స్పెషలిస్ట్ పండిత్ విశ్వరాజ్ : భార్యాభర్తల కలహాలు, శత్రు నాశనం, ప్రేమ సమస్యలు & మీ ఎటువంటి సమస్యలకైనా 5 గంటల్లో 100% పరిష్కారం. ఫోన్‌లో పరిష్కారం చేయగలరు. 8121931984. NT-334815

**GOLD FINANCE**



★ మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-335055

**INSURANCE**

★ Become an Life Insurance Advisor with TATA-AIA. Work from anywhere 100% Digitally. Unlimited Income, Growth & International Trips Every Month. Part Time / Full Time. Call / WhatsApp: 9505931826. NT-338861

**DASARA OFFER**

★ Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516. NT-333073

**OLD AGE HOME**



★ వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 8074327715. NT-334825

**PLOT FOR SALE**



★ నాగార్జునసాగర్ హైవే యాచారం టౌన్‌లో గజం: రూ. 8,990/- DTCP అప్రూవల్ లేఅవుట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్పాట్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. Ph: 9014297729, 8919631310. NT-338776

★ గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 9666607146. NT-338784

**PLOT FOR SALE**

★ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బీబీనగర్ టౌన్, AIMSకు అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే॥క॥, అల్ డె॥, స్పాట్ రిజి॥, బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9912357546. NT-336726

**WANTED**

jobs Apply Now!

★ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో Sales & Door to Door మార్కెటింగ్ చేయడానికి Males & Females కావలెను. Quali: Inter, Degree. మంచి Salary + కమీషన్. Office: Uppal. 8341205679. NT-336719

★ సోమాజిగూడ ఏరియాలో ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు అనుభవజ్ఞులైన డ్రైవర్లు కావలెను. మంచి జీతం కలదు. PF మరియు ESI సౌకర్యం కలదు. సంప్రదించగలరు. 9154638558. NT-338852

★ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు టెలికాలర్స్ శాలరీ. 8K to 20K మరియు టీం లీడర్స్ శాలరీ: 25K to 1 Lakh వరకు. ఇన్సెంటివ్ + అలవెన్స్ కలదు. ఫోన్: 7842520541, 9440515793. NT-338777

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073. NT-331783-All

**CHANGE OF NAME**

★ I, Shahana Begum D/o. Syed Shafiullah Age 38 yrs, Add: H.no.3-11-97, K L Reddy Nagar, Mallapur, Hyd-76. have changed my name to Shahana Clement vide Affidavit Number BA298930 date 04.10.2024 before Notary by N Narasimha Rao. NT-38312

★ I, Doddi Sitha Maha Laxmi D/o. Rama Krishna Vara Prasad Rao Penakati R/o. H.No. 1-7-31, Plot No- 33/p, South Kamala Nagar, ECIL, Kapra, Medchal-Malkajgiri, Telangana-500062. have changed my name to Sitha Maha Laxmi Penakati NT-38314

**గమనిక**


క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

Cell: 9848077857

దిల్‌సుఖ్‌నగర్ : 9182777805
మల్కాజిగిరి, E.C.I.L: 9182777125
L.B.నగర్, వనస్థలిపురం : 9182777209
ఉప్పల్, తార్నాక : 9182777806
అమీర్‌పేట్, మెహిదీపట్నం : 9182777126
B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205


# 18 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్




సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): మూడు రాష్ట్రాల్లో.. ఆరు బృందాలతో సైబర్ నేరగాళ్ల కోసం గాలించి.. 18 మంది నేరస్థులను అరెస్ట్ చేశారని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదివారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో ముగ్గురు సైబర్‌నేరాలలో మాస్టర్ మైండ్ ఉన్నవారని, రూ. 6.94 కోట్ల ఆర్థిక నష్టం జరిగిన 10 ప్రధాన కేసులను సైబర్‌క్రైమ్ యూనిట్ ఛేదించిందని తెలిపారు. ఇందులో 6 ఇన్వెస్ట్‌మెంట్, ఒకటి డిజిటల్ ఫ్రాడ్ అరెస్ట్, మరొకటి సెక్స్టార్షన్ మోసం, ఓటీపీ ఫ్రాడ్‌తో పాటు మరో ఇన్సూరెన్స్ ఫ్రాడ్ కేసును కూడా ఛేదించామని తెలిపారు. సైబర్‌క్రైమ్స్ డీసీపీ దార కవిత పర్యవేక్షణలో ఏసీపీలు శివమారుతి, చాంద్‌పాష నేతృత్వంలోని ఇన్‌స్పెక్టర్లు మట్టం రాజు, ప్రమోద్‌కుమార్, సీతారాములు, కె.ప్రసాద్‌రావు, ఎస్.నరేశ్ బృందాలు కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో సైబర్‌నేరగాళ్ల కోసం గాలింపు చేపట్టి.. 18 మంది నేరగాళ్లను అరెస్ట్ చేశారు.

- బెంగళూరుకు చెందిన రిద్ద్ బేడీ, ఇన్సూరెన్స్ కంపెనీ పేరుతో ముంబైకి చెందిన అమీర్ కాశీనాథ్ జాదవ్, రాజస్థాన్‌కు చెందిన షైకుల్ ఖాన్ మెవతీ సైబర్‌నేరగాళ్లతో చేతులు కలిపారు. ఖాతాలు తెరిపించి.. ఆ ఖాతాల్లో డిపాజిటైన సొమ్మును నేరగాళ్లకు అందిస్తున్నారు.
- మిగతా నిందితుల్లో ఖాతాలు తెరిపించే ఏజెంట్లు, ఖాతా దారులు ఉన్నారు. మూడు రాష్ట్రాలకు చెందిన నికేశ్ భాటీ, సయంవ బిమాన్ దాస్, యోగేశ్ కుమార్, దేవరాజ్ చంద్రవత్, సన్నీ అలియాస్ రోహన్ యాదవ్, మహ్మద్ ఆరీఫ్ బర్ఖత్ అలీ షేక్, సాకేత్ సతీశ్ టెంబుర్నె, అన్న గోకల్ దాగే, అజయ్ గోపీనాథ్ మిశ్రా, కపిల బహుసాహేబ్ నాగరే, శ్రీధర్, ఉదయ్‌కుమార్, వరణ్‌కుమార్, కౌశిక్, సమీన్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు.
- నిందితుల వద్ద నుంచి రూ. 5 లక్షల నగదు, 26 మొబైల్ ఫోన్లు, 16 ఏటీఎం కార్డులతో పాటు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల్లో రూ.1,61,25,876 ఫ్రీజ్ చేశారు.
- దేశ వ్యాప్తంగా 319 కేసులతో నిందితులకు సంబంధం ఉన్నది. వీటిలో 45 తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

**20 మందికి టోకరా..**
**రూ.3.8 లక్షలు వసూలు**
**ఓయో హోటల్ గదిలో పరీక్షలు**
**నియామకాల పేరుతో నకిలీ ఆఫర్ లెటర్లు**
**మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు**

వెంగళరావునగర్, అక్టోబర్ 6: సాఫ్ట్‌వేర్ సంస్థల్లో బ్యాక్‌డోర్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి, మోసగించిన ఘటనపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన లక్ష్మీ కోటేశ్వరమ్మ మధురానగర్‌లోని ఓ హాస్టల్లో ఉంటూ.. జాబ్ సెర్చింగ్ చేస్తున్నది. ఈ క్రమంలో ఆమెకు స్నేహితుడైన శివకృష్ణ ద్వారా గచ్చిబౌలిలోని ఆరెంజ్ వీజీ హాస్టల్‌లో ఉండే వెంకటేశ్ పరిచయమయ్యాడు. తాను సాఫ్ట్‌వేర్ సంస్థల్లో బ్యాక్‌డోర్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానని వెంకటేశ్ నమ్మబలికాడు. అందుకు ఒక్కొక్కరు రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అతడి మాటలు నమ్మిన ఆమె ఆన్‌లైన్ ద్వారా రూ.50 వేలు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆమెతో పాటు ఆమె స్నేహితులు దాదాపు 20 మంది నుంచి కూడా రూ.3.3 లక్షలు వెంకటేశ్, అతడి సోదరుడు నిఖిల్ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. కొద్ది రోజుల తర్వాత వారికి ఉద్యోగాలు ఇస్తున్నట్లు అపాయింట్‌మెంట్ లెటర్లు పంపారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు రాయాల్సి ఉంటుందని చెప్పి.. ఓయో హోటల్‌కు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాడు. ఆ తర్వాత బాధితులు కంపెనీ వెబ్‌సైట్‌ను పరిశీలించగా.. ఈ పరీక్షలన్నీ మోసమని తేలింది. దీంతో బాధితులు తీసుకున్న డబ్బు ఇవ్వాలని పట్టుబట్టారు. ఎంతకీ డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# సీసీఎంబీ వైల్డ్ లైఫ్ వీక్‌కు అనూహ్య స్పందన

సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): సీసీఎంబీ వైల్డ్ లైఫ్ వీక్‌కు అనూహ్య స్పందన వచ్చింది. అత్తాపూర్‌లోని లాకోన్స్ ల్యాబోరేటరీలో వైల్డ్ లైఫ్ పరిశోధనలపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు, బయాలజిస్టులు, జీవశాస్త్ర పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. వైల్డ్‌లైఫ్ వీక్ కార్యక్రమంలో భాగంగా పెయింటింగ్, ప్రసంగాలు, చర్చావేదికలతో అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత పెయింటింగ్ పోటీలను నిర్వహించగా, సరీసృపాలు, క్రూర మృగాలు, అంతరించిపోతున్న జాతుల జీవవైవిధ్యం, వాటిని సంరక్షించే విధానాలు, డీఎన్‌ఏ ద్వారా వాటిని పరిరక్షించేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. సీసీఎంబీ పరిశోధకులు అనురాధ రెడ్డితోపాటు పలువురు శాస్త్రవేత్తలు పలు అంశాలను చర్చించారు.

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుకు ఎదురెళ్లి..

జీడిమెట్ల, అక్టోబర్ 6: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సుకు ఎదురుగా వెళ్లి.. ఢీకొట్టి తీవ్ర గాయాలతో మరణించాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి మద్యం మత్తులో రోడ్డుపై తిరుగుతూ వచ్చిపోయే వాహనాలకు అడ్డుగా వెళ్లాడు. స్థానికంగా ఉండే అబ్బాస్ అనే వ్యక్తి గుర్తించి.. అతడిని రోడ్డు పైనుంచి తీసుకొచ్చి పక్కన కూర్చోబెట్టాడు. కొంత సేపటి వరకు అతడు రోడ్డు పక్కన కూర్చున్నాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి బాలానగర్ నుంచి గండిమైసమ్మ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఎదురుగా పరుగెత్తుకుంటూ వచ్చి.. బస్సు ఎడమ వైపు గుద్దుకున్నాడు.. ఈ ప్రమాదంలో అతడి ఛాతికి గాయమై.. అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బహిరంగ సభలో సత్తా చాటుదాం



హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 6: డిసెంబర్ రెండో వారంలో నిర్వహించే బహిరంగ సభలో తమ సత్తాను చాటాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ, క్రిమిలేయర్‌పై రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బెంచ్ డిస్మిస్ చేయడం వెనుక ప్రధాని నరేంద్ర మోదీ హస్తం ఉన్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు, పబ్బతి శ్రీకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సి.హెచ్.రోజాలీలా, నగర అధ్యక్షుడు చిప్పరి సుబ్బారావు, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అశోక్, నేతలు తీగల శేఖర్, సుచంద్ర, సునీల్, హరీశ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 6: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ కథనం ప్రకారం.. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన రాజు (36) భవన నిర్మాణ కార్మికుడు. ఆదివారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి నుంచి అత్తాపూర్ వైపు తన ద్విచక్ర వాహనంపై రమేశ్‌తో కలిసి వెళ్తున్నాడు. దుర్గానగర్ చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో రాజు తల రోడ్డుకు కొట్టుకోవడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్‌కు గాయాలు కావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాజు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# గూడ్స్ రైలు ఢీకొని..

కాచిగూడ, అక్టోబర్ 6: గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్‌లోని బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన వినోద్‌కుమార్ (30) ప్రైవేటు ఉద్యోగి. ఆదివారం బుద్వేల్ యార్డ్‌లో 2వ ప్లాట్ ఫారానికి వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా.. అదే సమయంలో వచ్చిన గూడ్స్ రైలు ఢీకొనడంతోఅతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అతడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

# హోటల్ నిర్వాహకులు పరిశుభ్రతను పాటించాలి: జీహెచ్‌ఎంసీ

సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలో హోటల్స్ నిర్వాహకులు ఖచ్చితంగా ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటించాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ (ఆరోగ్య) ఒక ప్రకటనలో ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) మార్గదర్శకాలను చాలా హోటళ్ల నిర్వాహకులు పాటించడం లేదని, ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందని పేర్కొన్నారు. అలాంటి హోటల్స్‌లో తనిఖీ చేసి జరిమానాలు విధించామని, ఇకనుంచైనా నిర్వాహకులు హోటల్స్ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో పాటు సీసీ టీవీ, కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులకు సురక్షితమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వ సంస్థలు రూపొందించిన నిబంధనలను పాటించాలని, లేనిచో వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా వంట గది శుభ్రతను పరిశీలించేందుకు సీసీటీవీ కెమెరాలను వంట గదిలోనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ ఇచ్చిన లైసెన్స్‌ను తప్పక హోటల్స్‌లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

# రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

మన్సూరాబాద్, అక్టోబర్ 6: అక్రమంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లాకు చెందిన మునగాల వెంకటపతి (22) చైతన్యపురిలో ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. పట్నం సుబ్బారాయుడు (25), విస్లావత్ వెంకటేశ్ (20) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి.. చైతన్యపురిలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. పట్నం సుబ్బారాయుడు, వెంకటేశ్ కలిసి కొంతకాలంగా ఎల్బీనగర్, ఎన్టీఆర్‌నగర్‌లో ఉంటున్న వారి వద్ద నుంచి రూ.11 చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేసి, మునగాల వెంకటపతికి ఇస్తున్నారు. ఆ బియ్యాన్ని వెంకటపతి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి వెంకటపతి, సుబ్బారాయుడు, వెంకటేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి.. ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు.

# హైడ్రా పేరుతో ఫెరోజ్ ఖాన్ అనుచరుల బెదిరింపు..

మెహిదీపట్నం, అక్టోబర్ 6: హైడ్రా పేరుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మహ్మద్ ఫెరోజ్‌ఖాన్ అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ నాంపల్లి నియోజకవర్గం అహ్మద్ నగర్ డివిజన్ సయ్యద్‌నగర్ వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఎన్నో ఏండ్లుగా ఉంటున్న మమ్మల్ని స్థలం ఖాళీ చేసి పోవాలని బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. సయ్యద్ నగర్‌లో ఉంటున్న పలువురు పేద వారిని నాంపల్లి నియోజకవర్గంకు చెందిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఫెరోజ్ ఖాన్ అనుచరులు గత రెండు రోజులుగా తీవ్రంగా బెదిరిస్తున్నారని, హైడ్రా పేరు చెప్పి కూల్చివేతలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారని, తాము ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లమని వారు చెబుతున్నారు. ఫెరోజ్ ఖాన్ అనుచరులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# యువతి హత్య కేసులో నిందితురాలి అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ముత్తు

మూసాపేట, అక్టోబర్ 6: యువతి హత్య కేసులోని నిందితురాలిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితురాలి వద్ద నుంచి వెండి నగలు, టీవీఎస్ స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేశ్ కుమార్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాకు ప్రియాంక (23) రెండు నెలల కిందట హైదరాబాద్‌కు వచ్చి కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటూ.. వ్యభిచారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. అదే వృత్తిలో ఉన్న జగద్గిరిగుట్టకు చెందిన మంజుల (35)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. 20 రోజుల కిందట ప్రియాంక తన వెండి పట్టీలు, మెట్టెలను మంజుల వద్ద భద్రపరిచింది. ఆ వస్తువులను తిరిగి ఇవ్వమని ప్రియాంక కోరగా.. ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. 29వ తేదీన ప్రియాంక తన స్నేహితుల సహాయంతో మంజులను బెదిరించి నగలు తీసుకుంది. ఇది మనసులో పెట్టుకున్న మంజుల.. 30వ తేదీ రాత్రి ప్రియాంకను పిలిచి మద్యం తాగించింది. స్కూటీపై కొంత దూరం తీసుకెళ్లి కింద పడవేసి (హత్య జరిగిన స్థలం) బ్లేడ్‌తో గొంతు కోసి హత్య చేసింది. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా కూకట్‌పల్లి పోలీసులు నిందితురాలిని గుర్తించి, అరెస్టు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ముత్తు తదితరులు పాల్గొన్నారు.



ఈశాన్య రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన బృందంతో ముఖ్య అతిథులు

# రాష్ట్రపతి నిలయంలో ముగిసిన కళా మహోత్సవ్

## హాజరైన బ్రిటీష్ డిప్యూటీ కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ఆర్మీ అధికారులు

బొల్లారం, అక్టోబర్ 6: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక ఔత్సాహికులను ఒకచోట చేర్చేందుకు కళా మహోత్సవ్ వేడుకలు వేదికగా నిలిచాయని నిలయం అధికారిణి రజినీ ప్రియ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రిటీష్ డిప్యూటీ కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, టాసా జనరల్ మేనేజర్ రాకేశ్ మనోచా, ఆర్మీ అధికారులు నమితా సింగ్, సుదీప్తా, లెఫ్టినెంట్ కల్నల్ శర్మ, రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి పట్టాభి రామారావు, టాసా కల్నల్ జబీన్ పాల్ హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విభిన్న కళాకారులు, బ్యాండ్, బృందగానాలతో కూడిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. చేనేత వస్త్రాలు, వివిధ కళాకారులచే హస్త కళలు, యువత నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ప్రసన్న గోగోల్, రోషన్ రెహమాన్, సుభరీశ్, షరీక్, హుస్సేయన్, సిబ్బంది పాల్గొన్నారు.